
వరంగల్ వాయిస్
Evening Daily
సంపుటి : 04 | సంచిక : 362
పేజీలు : 08 | వెల: రూ.5/-
బుధవారం
నవంబర్ 26, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net

## ఇన్ స్పెక్టర్‌తో పాటు కానిస్టేబుల్ సస్పెన్షన్




### ఉత్తర్వులు జారీ చేసిన సీపీ

ఇటీవల మామూనూరు పోలీస్ స్టేషన్ నుంచి కంట్రోల్ రూమ్ కు బదిలీ అయిన ఇన్ స్పెక్టర్ ఓ.రమేష్ తో పాటు మామూనూర్ కానిస్టేబుల్ జి.రఘును సస్పెండ్ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సస్పెండ్ అయిన ఇరువురు మామూనూర్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహించిన సమయంలో వీరిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో వాస్తవాలు వెలుగులోకి రావడంతో పాటు వచ్చిన ఆరోపణలు నిర్ధారణ కావడంతో సీపీ వీరిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. – వరంగల్ వాయిస్, క్రైం



- గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి
- పట్టుకోసం అధికార, విపక్షాల రణం
- శీతాకాలం చలిలో మొదలైన రాజకీయ వేడి
- బలం, బలగంతో సిద్ధపడుతున్న ఆశావహులు
- టికెట్ తనకే అంటూ ప్రచారం
- విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్న పార్టీలు

# రణరంగమే..



శీతాకాలం చలిలో రాజకీయ వేడి మొదలైంది. పంచాయతీ ఎన్నికలకు నగారా మోగడంతో గ్రామాల్లో రాజకీయ హడావిడి జోరందుకుంది. పార్టీ రహితంగానే ఎన్నికలు జరగనున్నప్పటికీ అధికార, విపక్ష పార్టీలకు సర్పంచ్ పదవులు అత్యంత కీలకం కానున్నాయి. ఆయా పార్టీలు స్థానికంగా పట్టు సాధించాలంటే సర్పంచ్ పదవులను గెల్చుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. దీంతో నువ్వా.. నేనా అన్నట్లుగా రాజకీయ పార్టీలు పోటీ పడుతున్నాయి. ఇప్పటికే ఎన్నికల కమిషన్ గ్రామాల వారీగా రిజర్వేషన్లు ప్రకటించడంతో ఎవరికి వారు తమ బలం, బలగం ప్రదర్శిస్తున్నారు. అయితే అధికార కాంగ్రెస్ పార్టీ పట్టుకోసం ప్రయత్నిస్తుంటే ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా వ్యూహాలు పన్నుతోంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయినప్పటికీ పల్లెల్లో తమకు ఏమాత్రం ప్రాధాన్యం తగ్గలేదని నిరూపించేందుకు బీఆర్ఎస్ పాకులాడుతోంది. సందట్లో సడేమియా అన్నట్లు బీజేపీ తన పట్టును నిలుపుకునేందుకు సిద్ధంగా ఉంది. బీజేపీతోనే గ్రామాల్లో సుపరిపాలన సాధ్యం అంటూ ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లు రాష్ట్రాన్ని దోచుకుతింటున్నాయని బీజేపీ అధికారం ఇస్తే అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తామంటూ ప్రకటిస్తున్నారు. విజయం సాధించడమే లక్ష్యంగా మూడు పార్టీలు పోటీకి సిద్ధం కావడంతో గ్రామాలు రణరంగంగా మారుతున్నాయి.

- వరంగల్ వాయిస్ ప్రతినిధి

వివరాలు2లో..

## కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం ‘టెక్స్‌టైల్ హబ్’

వరంగల్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం | బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ | పార్టీ నేతలతో కలిసి టెక్స్‌టైల్ పార్క్ సందర్శన

8లో..






8లో..

## ఘనంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం

వేలాదిగా పాల్గొన్న భక్తులు

# రణరంగమే..




- గ్రామాల్లో మొదలైన ఎన్నికల సందడి
- పట్టుకోసం అధికార, విపక్షాల రణం
- శీతాకాలం చలిలో మొదలైన రాజకీయ వేడి
- బలం, బలగంతో సిద్ధపడుతున్న ఆశావహులు
- టికెట్ తనకే అంటూ ప్రచారం
- విజయమే లక్ష్యంగా పావులు కదుపుతున్న పార్టీలు

**వరంగల్ వాయిస్ ప్రతినిధి :** పల్లెల్లో శీతాకాలం చలిలో రాజకీయ వేడి మొదలైంది. పంచాయతీ ఎన్నికలకు నగారా మోగడంతో గ్రామాల్లో రాజకీయ హడావిడి జోరందుకుంది. పార్టీ రహితంగానే ఎన్నికలు జరగనున్నప్పటికీ అధికార, విపక్ష పార్టీలు రాజకీయంగా పట్టు సాధించాలంటే సర్పంచ్ పదవులు కీలకం కానున్నాయి. తమ పార్టీ అభ్యర్థులను నిలబెట్టడం, గెలిపించుకోవడం కోసం గట్టి ప్రయత్నాలు చేయనున్నారు. దీంతో గ్రామాలు ఇప్పుడు రాజకీయ రణక్షేత్రాలు కానున్నాయి. పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో పోటీ చేయాలనుకొనే ఆశావహులు మద్దతు కూడగట్టు కునేందుకు ముమ్మర ప్రయత్నాలు ప్రారంభించారు. తమ వర్గాలు, గ్రూపులను పోగేసుకోవడంతో పాటు తమ ప్రాతినిధ్యాన్ని బలపర్చాలని ముఖ్య కార్యకర్తలు, అనుచరులను కోరుతున్నారు. రిజర్వేషన్లు ఖరారు కావడంతో కొందరు అభ్యర్థులు తమ భార్యలను రంగంలోకి దింపే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటి నుంచి ఆయా పార్టీల పెద్దలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజా ప్రతినిధులను ప్రసన్నం చేసుకొని ఎలాగైనా పోటీలో నిలిచేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను కూడా ప్రసన్నం చేసుకొనే పనిలో పడ్డారు.

### మొదలైన పల్లె పోరు..

మొత్తంగా పల్లె పోరు మొదలైంది. తాజాగా ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. మూడు విడుతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించగా, మంగళవారం సాయంత్రం నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. మూడు దశల్లో నిర్వహించే గ్రామ పంచాయతీల పేర్లను యంత్రాంగం ఖరారు చేసింది. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయడంతోపాటు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు సన్నద్ధమైంది. ఎన్నికలు పార్టీ రహితమే అయినప్పటికీ తమ అభ్యర్థులను గెలిపించుకొని గ్రామాలపై పట్టు సాధించేందుకు ఆయా పార్టీలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. అయితే ఇప్పటికే ఓసారి సర్కారు చేసిన హడావుడిని నమ్మి ఆశావహులు భారీగా ఖర్చు చేసి నష్టపోవాల్సి వచ్చింది. అప్పుడు ఎన్నికల షెడ్యూల్ రద్దు కావడంతో నిరాశ చెందారు. ఇప్పుడు మరోసారి షెడ్యూల్ రావడంతో తమ ప్రయత్నాల్లో తలమునకలయ్యారు. కోర్టులో కేసు ఉందని తెలిసినా సర్కారు చేసిన హడావుడిని నమ్మిన ఆశావహులు, ఇప్పటికే తమ ప్రయత్నాల్లో మునిగి తేలుతున్నారు.

### పట్టుకోసం ప్రయత్నం..

ఇది లా ఉంటే పల్లెల్లో పట్టు నిరూపించుకోవాలని ప్రధాన పార్టీలు తహతహ లాడుతున్నాయి. పార్టీ రహిత ఎన్నికలే అయినా తమ అభ్యర్థులను గెలిపించుకునేందుకు ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టాయి. ఇకపోతే రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించడంతో నామినేషన్ల పర్వం కూడా మొదలైంది. గతంలో ఓ మారు నోటిఫికేషన్ విడుదల, రద్దు కావడంతో అప్పటికే సిద్ధంగా ఉన్న అభ్యర్థులు మళ్లీ పోటీకి రంగం సిద్ధం చేసుకున్నారు. ఈసారి సర్పంచ్ ఎన్నికలకు మాత్రమే ఎన్నికలు జరుగనున్నాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు తరవాత నిర్వహించాలని నిర్ణయించడంతో గ్రామ పంచాయతీ ఎన్నికలు మాత్రమే ఎన్నికలు జరుగబోతున్నాయి.

### మూడు దశల్లో ఎన్నికలు..

మొత్తం మూడు దశల్లో ఎన్నికలు జరుగబోతున్నాయి. మూడు వారాల సమయంలోనే మొత్తం ప్రక్రియ ముగియనుండడంతో గ్రామాలు కేంద్రంగా రాజకీయ పార్టీలు బలాబలాలకు రంగం సిద్ధం చేశాయి. 27తో తొలి దశ ఎన్నికల ప్రక్రియ మొదలై డిసెంబర్ 17తో మూడో దశ పంచాయతీ ఎన్నికలు ముగియనున్నాయి. ఒకే రోజు పోలింగ్, అదే రోజు ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి చేపట్టబోతున్నారు. అదికూడా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మాత్రమే పోలింగ్ జరగ నుండడంతో గ్రామాల్లో ఓట్ల వేటలో అభ్యర్థులు పడ్డారు. డిసెంబర్ 11న తొలిదశ, డిసెంబర్ 14న రెండో దశ, డిసెంబర్ 17న మూడో దశ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో నామినేషన్ల పర్వం కూడా వెంటనే మొదలైంది. తొలి విడతలో ఎన్నికలు జరిగే గ్రామాల్లో అభ్యర్థులకు కేవలం రెండు వారాలు మాత్రమే ప్రచారానికి సమయం దొరుకుతోంది. రెండో విడతలో పోటీ చేసే వారికి షెడ్యూల్ జారీ నుంచి మొదలు పెడితే అదనంగా నాలుగైదు రోజులు కలిసి వస్తోంది. తుది విడతలో పోటీ చేసే వారికి దాదాపుగా మూడు వారాల సమయం దక్కుతోంది.

### దావత్ ల జోరు..

సర్పంచ్ ఎన్నికలకు సమాయత్తం అవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో ఇక మళ్లీ దావత్‌ల జోరు అందుకోనుంది. ఎన్నికల సంఘం నుంచి ప్రకటన ఉంటుందని తెలిసి హడావిడిగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిందని విపక్ష నేతలు విమర్శిస్తున్నారు. మరోవైపు మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు కూడా పంపిణీ చేశారు. కొన్ని ప్రాంతాల్లో రుణాల పంపిణీ సంపూర్ణంగా జరుగలేదు. మొత్తానికి చీరల పంపిణీని ప్రభుత్వం పకడ్బందీగా చేపట్టినప్పటికీ క్షేత్ర స్థాయిలో మహిళా లోకం నుంచి స్పందన ఎలా ఉంటుందన్నది చూడాలి. సర్పంచ్ ఎన్నికల్లో మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ పార్టీ తన చేతులో ఉన్న అధికారాన్ని అడ్డంగా వాడుకుంటుండటంపై బీఆర్ఎస్, బీజేపీల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. అయితే ప్రచారానికి అధిక సమయం దక్కడం ఒకింత మంచిదే అయినప్పటికీ ఎన్నికల ఖర్చు తడిసి మోపెడు అవుతుందనే బాధ కూడా తుది విడత అభ్యర్థుల్లో ఉంది. మొత్తంగా గ్రామాల్లో హడావిడి కొనసాగుతోంది. ఓటర్లకు మాత్రం ఇది ముమ్మాటికీ పండగే.



### 20 నెలల క్రితమే ముగిసిన కాలపరిమితి

20 నెలల క్రితమే 2024 ఫిబ్రవరి ఒకటితో పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. రాజ్యాంగంలోని 243(3) (ఏ) ఆర్టికల్ ప్రకారం పంచాయతీ రాజ్ సంస్థల ఎన్నికలను ఐదేళ్ల పదవీ కాలం ముగిసేలోపే నిర్వహించాల్సి ఉంటుంది. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 14(2) ప్రకారం.. పంచాయతీ పాలకవర్గ పదవీకాలం ముగిసిన మూడు నెలల్లోగా ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుందని స్పష్టం చేస్తోంది. పాలకవర్గాల గడువు పూర్తి కావడంతో సర్పంచ్ ఎన్నికలను నిర్వహించేందుకు కావాల్సిన ఏర్పాట్లను వెంటనే చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల సంఘం గతేదాది డిసెంబర్ 14న రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేసింది. కానీ, ఆచరణలో మాత్రం ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరించింది. బీసీ రిజర్వేషన్లు, తదితర అంశాలను సాకుగా చూపి.. పంచాయతీ ఎన్నికల నిర్వహణను ఆలస్యం చేస్తూ వచ్చింది. అయితే బీసీ రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాదని భావించి, తాజాగా పంచాయతీ ఎన్నిలకు పచ్చజెండా ఊపడంతో దాదాపు 20 నెలల తర్వాత ఎన్నికలు జరుగనున్నాయి.

## తడి గుడ్డతో గొంతు కోసిన సీఎం

- బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు వెంకట్రాములు



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలను నమ్మించి తడి గుడ్డతో గొంతు కోశారని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఆరోపించారు. సీఎంకు కనువిప్పు కలిగించేలా జనరల్ స్థానాలన్నింటిలో బీసీలు పోటీ చేసి సత్తా చాటాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మాయ మాటలు చెప్పి నమ్మించి పాత రిజర్వేషన్ పద్ధతిలోనే ఎన్నికలు నిర్వహించడమంటే బీసీలకు నమ్మకద్రోహం చేయడమే అని విమర్శించారు. ఎన్నికల ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించి మార్చి 17న బీసీ బిల్లులను శాసనసభలో ఆమోదింపజేసి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి పంపించి చేతులు దులుపుకున్నారే తప్ప చేసిందేమీ లేదన్నారు. తమిళనాడులో జయలలిత పోరాడిన విధంగా కేంద్రంతో పోరాడకుండా, రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్లో చేర్పించే ప్రయత్నం చేయకుండా నెలల తరబడి కాలయాపన చేశారంటూ మండిపడ్డారు. బీసీల రిజర్వేషన్లను 17 శాతానికే పరిమితం చేయడం అత్యంత దుర్మార్గమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ అగ్రవర్ణాల ఆధిపత్య కులాలకు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా బీసీలు వారి నిజస్వరూపాన్ని గ్రహించాలన్నారు. రాజకీయాలకు అతీతంగా స్థానిక సంస్థలు, చట్టసభలు, విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలన్నింటిలో రిజర్వేషన్ల సాధనకు సమైక్య పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సర్పంచ్ ఎన్నికలలో జనరల్ స్థానాలలో బీసీలు పోటీ చేసి తమ సత్తా చాటాలని వెంకట్రాములు పిలుపునిచ్చారు.

## నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 22,27 డివిజన్ లలో రహదారుల పరిశీలన



**వరంగల్ వాయిస్, వరంగల్ :** సీసీ రహదారుల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. బుధవారం 22 ,27వ డివిజన్ పరిధిలోని పోచమ్మ మైదాన్, దేశాయి పేట, రామ్ నాథ్ పూరి, వాసవి కాలనీ, అబ్బనికుంట ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్ర స్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించడానికి అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. డి మార్ట్ ప్రాంతంలో కొనసాగుతున్న యూజీడి క్లీనింగ్ ను కమిషనర్ పరిశీలించారు. సీబీసీ చర్చ్ ప్రాంతంలో కొనసాగుతున్న సీసీ రోడ్డు ఆన్ గోయింగ్ పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు కుమార స్వామి, ఎస్ఈ సత్యనారాయణ, ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి, డీఈ సతీష్, ఏఈలు మురళి కృష్ణ, హబీబ్, టీపీబీఓ నవీన్, వర్క్ ఇన్ స్పెక్టర్ లు విక్రమ్, పవన్ పాల్గొన్నారు.

# రాజ్యాంగమే దేశ ఆత్మ

## ◆ సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత రాజ్యాంగ అమలు దినోత్సవాన్ని పురస్కరించుకుని సీపీఐ వరంగల్ జిల్లా కార్యాలయం తమ్మేర భవన్, శివనగర్‌లో బుధవారం ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ భారత రాజ్యాంగం మన దేశానికి ఆత్మ వంటిదని, ఇది ప్రజాస్వామ్యం ఇచ్చిన అత్యంత అమూల్యమైన వారసత్వం అని అభివర్ణించారు. రాజ్యాంగం కేవలం పరిపాలనా నియమాల పుస్తకం కాదని, అది న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి విలువలకు మార్గదర్శక దీపస్తంభం అని షేక్ బాష్ మియా అన్నారు. అనేక భాషలు, మతాలు, సంస్కృతులు, వర్గాలతో కూడిన భారతదేశాన్ని ఒక గూటిగా నిలిపింది రాజ్యాంగమే అని ఆయన స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని కేవలం ఫార్మాలిటీగా కాకుండా, ఒక ప్రతిజ్ఞగా భావించాలని ఆయన మనస్ఫూర్తిగా కోరారు. మనం హక్కులను మాత్రమే కాక, పౌరులుగా ఉన్న కర్తవ్యాలను కూడా గౌరవించాలని గుర్తు చేశారు. రాజ్యాంగం కేవలం పుస్తకాలలో పరిమితమై ఉన్న పత్రంగా కాకుండా, మన వ్యవహారాల్లో, పాలనలో, ప్రజా జీవితాల్లో ప్రతిబింబించే జీవ శక్తిగా చూడాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. "రాజ్యాంగ రక్షణ మన చేతుల్లోనే ఉంది," అని షేక్ బాష్ మియా అన్నారు. ఈ పత్రాన్ని దేశ స్వరూపానికి ప్రతీకగా, ఉమ్మడి బాధ్యతకు చిహ్నంగా, ప్రజాస్వామ్య గర్వానికి నిదర్శనంగా భావించి, భవిష్యత్ తరాలకు మరింత బలమైన, న్యాయసమాజాన్ని అందించే దిశగా మనందరం కట్టుబడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండు లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు గన్నారపు రమేష్, జిల్లా సమితి సభ్యులు ఓర్సు రాజు, ల్యాదల్ల శరత్, నాయకులు జయ రాజ్, వంకటాద్రి శశి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 75వ రాజ్యాంగ దినోత్సవం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలో 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షులు శనిగరపు రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రపంచ మేధావి, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా "రాజ్యాంగం వర్ధిల్లాలి!", "జ్ఞానం వర్ధిల్లాలి!" అనే నినాదాలతో దినోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాసి 75 సంవత్సరాలు అవుతున్న సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. రాజ్యాంగం ద్వారానే ప్రతి పౌరుడికి ఓటు హక్కుతో పాటు, మహిళా హక్కులు, విద్య, కార్మిక, ఉద్యోగ, రాజకీయ రిజర్వేషన్లు, స్వేచ్ఛ, సమాన హక్కులు దక్కాయని గుర్తు చేశారు. ప్రపంచ దేశాలు ఆదర్శంగా తీసుకునే విధంగా భారత రాజ్యాంగాన్ని అంబేద్కర్ రూపొందించారని వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ డైరెక్టర్ కట్కూరి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ వడ్లకొండ నారాయణ గౌడ్, జడ్పీహెచ్‌ఎస్ ప్రిన్సిపాల్ దేసు సతీష్, డీఎస్పీ జిల్లా ఉపాధ్యక్షులు కండె రవి, ఓరుగంటి కృష్ణ, బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ మేకల ఓంకార్, డీటీఎఫ్ మండల అధ్యక్షులు చేరాల రాంబాబు, కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి కృష్ణ, డీలర్ ఇమ్మడి వెంకటేశ్వర్లు, మామిళ్ల మల్లికార్జున్, బీజేపీ జిల్లా నాయకురాలు బొల్లం అరుణ, చిలువేరు ఉదయాకర్, గంధం ఓదాకర్, మామిళ్ల మల్లేష్, ఆలూరి మొగిలి తదితరులు పాల్గొన్నారు.

# పర్వతగిరిలో కమలం జెండా ఎగరవేయాలి

## బీజేపీ మండల అధ్యక్షుడు భిక్షపతి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ పర్వతగిరి మండల నాయకత్వం వ్యూహాలు రచిస్తోంది. ఇందులో భాగంగా, బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు చీమల భిక్షపతి ఆధ్వర్యంలో పర్వతగిరి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో సర్పంచ్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ముఖ్య నాయకులకు, గ్రామ ఇన్‌చార్జిలకు, కార్యకర్తలకు మండల అధ్యక్షులు పలు సూచనలు తెలియజేశారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్న ఆశావాహుల పేర్లను ఈ సందర్భంగా సేకరించారు. మండల పార్టీ అధ్యక్షులు చీమల భిక్షపతి మాట్లాడుతూ రానున్న సర్పంచ్ ఎన్నికల్లో పర్వతగిరి మండలం గడ్డమీద కమలం జెండా ఎగరవేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ పార్టీ అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థికే టికెట్ కేటాయింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పార్టీలో కష్టపడుతున్న ప్రతి నాయకుడికి, కార్యకర్తకు తగిన గుర్తింపు లభిస్తుందని భరోసా ఇచ్చారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించే దిశగా అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పట్టపురం ఏకాంతం గౌడ్, జిల్లా నాయకులు కుడికాల శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బత్తిని దేవేందర్, యువమోర్చ అధ్యక్షులు గొల్లపెల్లి సంతోష్ కుమార్, మండల నాయకులు లక్ష్మణ్, యాకన్న, సంపత్, వీరస్వామీ, మధు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి



**వరంగల్ వాయిస్, చిట్యాల:** మండల కేంద్రంలో బుధవారం 76వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు జన్నె యుగంధర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ముఖ్య అతిథులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల అధ్యక్షుడు జన్నె యుగంధర్ జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి పుల్ల మల్లయ్య, అంబేద్కర్ సీనియర్ నాయకులు దొడ్డి కిష్టయ్య, ధబ్బేట రమేష్ లు మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కులాలకు భారత రాజ్యాంగం ఒక ఆశాజ్యోతి లాంటిదని అన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలకు పెద్దపీట వేస్తూ భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాంగాన్ని అందించారని వారు కొనియాడారు. విద్యార్థులు మరియు ప్రజలు ప్రతి ఒక్కరూ అంబేద్కర్ చరిత్రను, భారత రాజ్యాంగాన్ని చదవాలని, మరియు దేశాభివృద్ధి కోసం రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేద్కర్ ఆశయాలు, భావజాలాలను ముందుకు తీసుకెళ్తూ, ఆయన అడుగుజాడల్లో నడవాలని నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మండల మాజీ అధ్యక్షులు సరిగోమ్ముల రాజేందర్, ప్రధాన కార్యదర్శి పుల్ల ప్రతాప్, వర్ధమాన గేయ రచయిత దాసరపు నరేష్, సంఘు నాయకులు, అంబేద్కర్ వాదులు గొరిగింట్ల కిరణ్, పాముకుంట్ల చందర్, గడ్డం సదానందం, ఏకు కిషన్, పర్లపల్లి కుమార్, రమేషు, రాజమౌళి ప్రసాద్, వేల్పుల రాజ్ కుమార్, సాంబయ్య, శీల పాక ప్రణీత్, పుల్ల సమ్మయ్య, కట్కూరి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లయ్యకు నివాళిగా ఒగ్గు కథా గానం



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండల కేంద్రానికి చెందిన మాజీ వార్డు మెంబర్, కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తాళ్ల రమేష్ ముదిరాజ్ తండ్రి మల్లయ్య ముదిరాజ్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు. ఈ సందర్భంగా కోగిల్వాయి ఒగ్గు కళా బృందాలు మల్లయ్య ముదిరాజ్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించాయి. కళా బృందాల సభ్యులు ముందుగా మల్లయ్య ముదిరాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం దుఃఖంలో ఉన్న కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి అయిన తాళ్ళ రమేష్‌ను పరామర్శించేందుకు వచ్చిన ఒగ్గు కళాకారులు, మరణించిన మల్లయ్య ముదిరాజ్ ఆత్మ శాంతి చేకూరాలని కోరుతూ ప్రత్యేకంగా 'ఒగ్గు కథా రామ కీర్తన' నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, స్థానిక నాయకులు తాళ్ల రమేష్ ముదిరాజ్‌ను పరామర్శించి, మల్లయ్య ముదిరాజ్ మృతికి సంతాపం తెలిపారు.

# రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి బలమైన పునాది

## సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్



**వరంగల్ వాయిస్, నడికూడ :** భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26 దినోత్సవం సందర్భంగా, మన దేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాది వేయబడిందని ప్రముఖ సామాజికవేత్త నిమ్మల శ్రీనివాస్ అన్నారు. బుధవారం నిర్వహించిన 'భారత రాజ్యాంగ దినోత్సవం' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి విస్తృతమైన రాజ్యాంగాన్ని రూపొందించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ని ఈ సందర్భంగా గౌరవంతో స్మరించుకోవాలని, ఆ మహానుభావుడికి నివాళులర్పించాలని అన్నారు. మన రాజ్యాంగం ప్రతి భారత పౌరునికి స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం వంటి విలువలను అందించిందని శ్రీనివాస్ గుర్తు చేశారు. "ఈ విలువలు కేవలం మాటలు మాత్రమే కాదు, మనం అనుసరించాల్సిన జీవన మార్గం," అని ఆయన ఉద్ఘాటించారు. ఈ రోజున మనం మన హక్కులను గుర్తుచేసుకోవడంతో పాటు, పౌరులుగా ఉన్న బాధ్యతలను కూడా అందరూ గుర్తుంచుకోవాలని పిలుపునిచ్చారు. దేశ ప్రగతికి పాటుపడటం, రాజ్యాంగం చెప్పిన మార్గంలో నడవడం, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం మనందరి కర్తవ్యం అని స్పష్టం చేశారు. మన రాజ్యాంగ విలువలను గౌరవించి, వాటిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో పాటించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని నిమ్మల శ్రీనివాస్ తెలియజేశారు.

# పైప్‌లైన్ లీకేజీలతో రోడ్డంతా బురదమయం



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండలంలోని మానేరు నది నుంచి వల్లెంకుంట వరకు ఉన్న మంచి నీటి పైప్‌లైన్‌కు ఏర్పడిన బారీ లీకేజీలు స్థానిక ప్రజలకు, ముఖ్యంగా రైతులకు తీవ్ర ఇబ్బందులను సృష్టిస్తున్నాయి. లీకేజీల నుంచి వృథాగా రోడ్డుపైకి చేరుతున్న నీటి కారణంగా మానేరు నుంచి వల్లెంకుంట వరకు ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా బురదమయంగా మారింది. ప్రస్తుతం వరి కోతల సమయం కావడంతో రైతులు తమ వ్యవసాయ పనుల నిమిత్తం ట్రాక్టర్లు, ఇతర వాహనాలపై పొలాలకు వెళ్లాల్సి వస్తుంది. అయితే, రోడ్డుపై చేరిన బురద కారణంగా ట్రాక్టర్లు, వాహనాలు మధ్యలోనే దిగబడిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బురద కారణంగా కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ఒకవైపు తాగునీరు పెద్ద ఎత్తున వృథా అవుతుండగా, మరోవైపు ఈ బురద కారణంగా తమ జీవనం కష్టంగా మారిందని రైతులు అంటున్నారు. పైప్‌లైన్ లీకేజీల వల్ల తాగునీరు వృథా అవ్వడంతో పాటు, ఆ లీకేజీల ద్వారా కలుషితం అయ్యే ప్రమాదం కూడా ఉందని గ్రామ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించాలని, పైప్‌లైన్ లీకేజీలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని వల్లెంకుంట గ్రామ ప్రజలు, రైతులు ఏకగ్రీవంగా కోరుతున్నారు. సమస్యను వెంటనే పరిష్కరించి తమ ఇబ్బందులను తొలగించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ఓగ్లాపూర్‌లో రాజ్యాంగ దినోత్సవం



**వరంగల్ వాయిస్, దామెర :** భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన చారిత్రక దినాన్ని పురస్కరించుకుని బుధవారం ఓగ్లాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ సిబ్బంది, మహిళా కార్యకర్తలు కలసి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఇంజపెల్లి నరేష్, కారోబార్ కిన్నెర శ్రీనివాస్, అంగన్వాడీ టీచర్ లక్ష్మీభాయి, ఆశావర్కర్ రజిత, వీఓఏ సుజాత, సిబ్బంది రమేష్, చేరాలు, సవిత తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గంలో ఎమ్మెల్యే జీఎస్సార్ పర్యటన



**వరంగల్ వాయిస్, గణపురం :** భూపాలపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు (జీఎస్సార్) బుధవారం భూపాలపల్లి, గణపురం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో ఆయన పలు శుభకార్యాల్లో పాల్గొనడంతో పాటు, రెండు నూతన వ్యాపార సంస్థలను ప్రారంభించారు. ఎమ్మెల్యే జీఎస్సార్ తొలుత భూపాలపల్లి మండలంలో పర్యటించారు. కాంగ్రెస్ ముఖ్య నేత బాషవేన గంగరాజు ఇద్దరు కుమార్తెల నూతన వస్త్రాలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం అదే గ్రామంలో బావు మల్లయ్య గారి నూతన గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్నారు. అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన దయ్యాల శంకర్ కుమార్తె వివాహ వేడుకలో పాల్గొన్నారు. పడిదల బాపురావు మనుమడి వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కాలనీ నామపలకాన్ని ప్రారంభించారు. అదే మంజూరునగర్ లో లోటస్ మెడికల్ షాపును ప్రారంభించారు. మొరంచపల్లిలోని విజయ బాలాజీ గార్డెన్స్ లో జరిగిన పోల్సాని లింగారావు కుమారుడు కోటి వివాహ వేడుకలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే గణపురం మండల కేంద్రంలో పర్యటించారు. ధర్మారావుపేట రోడ్డులో యాదగిరికి చెందిన నూతన ప్రింటింగ్ ప్రెస్ ను టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఎమ్మెల్యే జీఎస్సార్ పర్యటనలో ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ బాధితుడికి అప్పగింత



**వరంగల్ వాయిస్, చిట్యాల :** మండలంలో సంవత్సరం క్రితం పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను చిట్యాల పోలీసులు రికవరీ చేసి, బుధవారం బాధితుడికి అప్పగించారు. చిట్యాల ఎస్-2 హేమలత చేతుల మీదుగా ఈ ఫోన్‌ను బాధితుడికి అందజేశారు. వివరాల్లోకి వెళితే, చిట్యాల మండలం ఏలేటి రామయ్య పల్లె గ్రామానికి చెందిన మర్రి రమేష్ సంవత్సరం క్రితం మార్గమధ్యంలో తన శాంసంగ్ మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నారు. వెంటనే బాధితుడు చిట్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చిట్యాల ఎస్ఐ ఆదేశాల మేరకు కానిస్టేబుల్ లాల్ సింగ్ అట్టి మొబైల్ ఫోన్ వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. రోజు ఆ పోయిన ఫోన్‌ను గుర్తించిన పోలీసులు, చిట్యాల ఎస్ఐ-2 హేమలత ద్వారా బాధితుడైన మర్రి రమేష్‌కు తిరిగి అందజేశారు. తమ పోగొట్టుకున్న విలువైన మొబైల్ ఫోన్‌ను రికవరీ చేసి ఇప్పించినందుకు బాధితుడు మర్రి రమేష్, చిట్యాల ఎస్ఐ-2 హేమలతకి, పోలీసు సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

◆ హనుమకొండ ఎస్ఐ పరశురాములు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని, అదేవిధంగా డ్రగ్స్ రహిత సమాజం నిర్మాణం కోసం నడుం బిగించాలని హన్మకొండ ఎస్ఐ పరశురాములు పిలుపునిచ్చారు. బుధవారం హన్మకొండ పట్టణంలోని నయీం నగర్‌లో గల మోషన్ కాలేజీలో విద్యార్థులకు డ్రగ్స్ మరియు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ పరశురాములు మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు బ్యాంకు లావాదేవీలపై కన్నేసి, అనేక రూపాల్లో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి మోసపోయినట్లయితే, వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు. విద్యార్థులు, యువకులను టార్గెట్ చేసుకొని కొంతమంది దుర్మార్గులు వారికి వివిధ రూపాల్లో డ్రగ్స్‌ను అలవాటు చేస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలియని వయసులో డ్రగ్స్‌కు అలవాటు పడి అనేకమంది విద్యార్థులు తమ భవిష్యత్తు జీవితాన్ని సర్వనాశనం చేసుకుంటున్నారని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుంటూ, ఉన్నతమైన స్థానానికి ఎదగాలి. దేశానికి, కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరికి పేరు ప్రఖ్యాతులు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో మోషన్ కాలేజీ ప్రిన్సిపాల్ ముత్యాల సురేష్, కాలేజ్ సిబ్బంది సుమన్, రాజు, రమేష్ గౌడ్, ఏఎస్ఐ రఘునాథ్ రెడ్డి, పోలీస్ స్టేషన్ సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి బుధవారం ఒక ముఖ్యమైన పుస్తకాన్ని ఆవిష్కరించారు. కోల్‌కతా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉన్న విద్యాసాగర్ కాలేజ్ ఫర్ విమెన్‌కు చెందిన అధ్యాపకురాలు డాక్టర్ ప్రదీప్త ముఖర్జీ సంపాదకత్వంలో వెలువడిన " "కానుండ్రమ్స్ అఫ్ డిపిక్షన్, రిసెప్షన్ అండ్ వైట్నెస్సింగ్ ఇన్ ఆర్ట్, లీటరేచర్ అండ్ సినిమా " పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం, డీన్ ఆచార్య బి.సురేష్ లాల్, ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. మేఘనా రావు, పుస్తక సంపాదకురాలు డాక్టర్ ప్రదీప్త ముఖర్జీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఈ పుస్తకంలో తమ ఆర్టికల్స్ ప్రచురితమైనందుకు ఇంగ్లీష్ విభాగాధిపతి డాక్టర్ ఆర్. మేఘనా రావును ప్రత్యేకంగా అభినందించారు.

## శారీరక, మానసిక దృఢత్వం పెంపొందించుకోవాలి



**వరంగల్ వాయిస్, కేయూ :** ఉద్యోగులు శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ఆచార్య కే.ప్రతాప్ రెడ్డి అన్నారు. ఆదివారం హన్మకొండ నగరంలో త్రినగరి క్రెడాయి ఆధ్వర్యంలో నిర్వహించిన "వరంగల్ ట్రై సిటీ హాఫ్ మారథాన్" లో పాల్గొని విజేతలుగా నిలిచిన కేయూ ఉద్యోగులను బుధవారం ఆయన అభినందించారు. కాళోజీ కళాక్షేత్రం నుంచి ప్రారంభమై తిరిగి అక్కడికే చేరిన ఈ మారథాన్‌లో పాల్గొని ప్రతిభ కనబర్చిన డాక్టర్ ఆర్.మేఘనా రావు, చిర్రా ప్రవీణ్ కుమార్, పుంపు డ్రైవర్ సాంబశివుడు, డాక్టర్ బండి వేణు, చింతల నరేష్‌ను వీసీ అభినందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఆరోగ్యంగా ఉండటం ఎంత ముఖ్యమో వీసీ నొక్కి చెప్పారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మెతుకు ఉప్పలయ్య



**వరంగల్ వాయిస్, మేడ్చల్ :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో బుధవారం జరిగిన ఒక వివాహ వేడుకలో మాజీ క్లాస్‌మేట్స్ తమ పిల్లల పెళ్లితో ఒక్కటయ్యారు. మార్గం సుధా, సోమ నర్సింహస్వామిల కుమార్తె సింధూరకు, హరిదాస్యపు పద్మ, రవికుమార్ల కుమారుడు సంతోష్ కుమార్ తో వివాహం జరిగింది. ఈ వివాహ మహోత్సవానికి మెతుకు ఉప్పలయ్య హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వధువు తండ్రి మార్గం సోమ నర్సయ్య, వరుడి తల్లి హరిదాస్యపు పద్మ పూర్వపు వరంగల్ జిల్లాలోని కొడకండ్ల జెడ్పీ హైస్కూల్‌లో 1986-1987 బ్యాచ్ పదవ తరగతి వరకు కలిసి చదువుకున్న క్లాస్‌మేట్స్ కావడం విశేషం. వారి స్నేహబంధం ఇప్పుడు పిల్లల పెళ్లితో మరింత బలపడింది. ఈ సందర్భంగా వారి సహచర క్లాస్‌మేట్స్ మంచినీళ్ల వెంకన్న, అనంతోజు నర్సయ్య కూడా హాజరయ్యారు. ఈ వివాహ వేడుకలో ఆలకుంట్ల రాములు, షీలా ఉపేందర్, మెతుకు ఉప్పలయ్య, తాడోజు వెంకటాచారి, అరుణ, ఉమా, కరుణ, ధనలక్ష్మి నర్సయ్య, ఉమాదేవి తదితరులు పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

# రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలి

◆ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి



**వరంగల్ వాయిస్, నక్కలగుట్ట:** భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగాలలో ఒకటి అని, దేశంలోని ప్రతి పౌరుడికి రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. బుధవారం నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్ కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సీఎండీ అధికారులు, సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్క ఉద్యోగి తమ విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా పని చేయాలని కోరారు. ఉద్యోగుల అధికారాలు, బాధ్యతలను ఎలా సమన్వయపరుస్తూ ఉండాలో కూడా రాజ్యాంగం నిర్దేశిస్తుందని ఆయన చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టాలని, దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్ రావు, వి.తిరుపతి రెడ్డి, సీవీవో బోనాల కిషన్, సీఈలు టి.సదర్ లాల్, కె.తిరుమల్ రావు, కె.రాజు చౌహాన్, కె.వెంకట రమణ, అశోక్, అన్నపూర్ణ, సురేందర్, శ్రవణ్ కుమార్, సీజీఎంలు రవీంద్రనాథ్, చరణ్ దాస్, జాయింట్ సెక్రటరీ శ్రీ కృష్ణ, జీఎంలు గిరిధర్, శ్రీనివాస్, వాసుదేవ్, మల్లికార్జున్, నాగ ప్రసాద్, సామ్య నాయక్, హేమంత్ కుమార్, కళాధర్ రెడ్డి, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి ప్రామాణికం

◆ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**వరంగల్ వాయిస్, ములుగు:** భారత రాజ్యాంగం మన దేశ ప్రజాస్వామ్యానికి ప్రామాణికం అని, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన మార్గంలోనే శక్తివంతమైన దేశ నిర్మాణం జరుగుతోందని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించడమే భారత రాజ్యాంగ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన 76వ రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ దివాకర టీ.ఎస్. ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా, నాలుగవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉందన్నారు. రాజ్యాంగ దినోత్సవం జరుపుకోవడం చాలా గర్వకారణం అని, మన దేశంతో పాటు స్వాతంత్ర్యం పొందిన ఇతర దేశాల కంటే భారతదేశం అన్ని రంగాలలో అభివృద్ధిలో ముందంజలో ఉండడానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ముఖ్య కారణమని ఆయన కొనియాడారు. అంబేద్కర్ మహోన్నతమైన వ్యక్తి: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చదువు, రాజనీతి, విధానాలు, విలువలు అన్నిటి పరంగా అందరికీ గొప్ప ఆదర్శ వ్యక్తి అని ఆయన కీర్తించారు. కలెక్టర్ రాజ్యాంగ దినోత్సవం యొక్క చారిత్రక ప్రాధాన్యతను వివరించారు. నవంబర్ 26న రాజ్యాంగ కమిటీ రాజ్యాంగాన్ని ఆమోదించడం ద్వారా, దీనిని మనం ప్రతి ఏటా రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. జనవరి 26న ఆమోదించిన రాజ్యాంగాన్ని ఈ తేదీన అమలులోకి తీసుకురావడం జరిగింది. దానిని మనం గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అంబేద్కర్ తో పాటు అనేకమంది మహోన్నతమైన వ్యక్తుల పోరాట ఫలితమే దేశ స్వాతంత్రం, రాజ్యాంగ నిర్మాణానికి దోహదపడిందని, వారందరి ఆశయాలను ప్రతి పౌరుడు పాటించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని భారత రాజ్యాంగ పరిరక్షణ సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలు ఆపండి



■ బీసీ జేఏసీ నాయకుల డిమాండ్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు సాధించాలనే డిమాండ్‌తో, 42 శాతం బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర పిలుపు మేరకు బుధవారం హన్మకొండ జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమం జరిగింది. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహం ఆవరణలో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీల ప్రతినిధులు పార్టీలకతీతంగా ప్లకార్డులు పట్టుకొని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ చందా మల్లయ్, రాష్ట్ర ఇంటలెక్చువల్ ఫోరం జాయింట్ సెక్రెటరీ ప్రొఫెసర్ కూరపాటి రమేష్ సంయుక్తంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు ఆపాలి, బీసీలకు చట్టబద్ధంగా రావలసిన 42 శాతం రిజర్వేషన్లను వెంటనే అమలుకు సిద్ధపడాలి, ఈ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించేందుకు వాటిని 9వ షెడ్యూల్లో చేర్చడానికి ప్రణాళికలు వేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రస్తుత సర్పంచ్ ఎన్నికలలో రాష్ట్రవ్యాప్తంగా కేవలం 17.03% మాత్రమే బీసీలకు ప్రభుత్వపరంగా కేటాయించారని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు సైతం స్థానిక సంస్థల్లో 22 శాతం కేటాయించాయని, ఇంతకన్నా బీసీలను అవమానపరిచిన ప్రభుత్వం మరొకటి లేదని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా రావలసిన హక్కులను ఈ ప్రభుత్వం కాలరాస్తోందని వారు విమర్శించారు. అంబేద్కర్ సాక్షిగా రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తమ నిరసనను, ఆవేదనను వెలిబుచ్చుతూ, రిజర్వేషన్ల లెక్కలను తిరిగి సరిచూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, మహిళా సమాఖ్య అధ్యక్షులు సదాలక్ష్మి, కోఆర్డినేటర్లు అయిన పొదిలి సాయిబాబా, మేకల సుమన్, కట్కూరి అనిల్, బాబు యాదవ్, గుగులోతు రాజన్న నాయక్, సురేష్ గౌడ్, రవీందర్, మేదరి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

◆ ప్రభుత్వ నిర్లక్ష్యంపై పెన్షనర్ల ఆగ్రహం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ తెలంగాణ హన్మకొండ జిల్లా శాఖ నూతన మీటింగ్ హాలును బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రారంభించుకుంది. ఈ కార్యక్రమం అనంతరం జరిగిన సమావేశంలో పెన్షనర్ల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వహిస్తున్న నిర్లక్ష్యంపై నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ కాసర్ల జనార్ధన్ రెడ్డి నూతన మీటింగ్ హాలును ప్రారంభించారు. అనంతరం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని అందరూ సామూహికంగా నిలబడి రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేశారు. జిల్లా శాఖ అధ్యక్షులు ఈ.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా కాసర్ల జనార్దన్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జి.వీరస్వామి, రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ వి.రామ్ మనోహర్ లు ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు రెండు సంవత్సరాలు కావస్తున్నా రిటైర్డ్ పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులు, పెన్షనర్లకు సంబంధించిన నగదు రహిత హెల్త్ కార్డులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, మార్చి 2024 నుంచి ఇప్పటివరకు రిటైర్డ్ అయిన పెన్షనర్ల పెండింగ్ బిల్లులు అన్నింటిని తక్షణమే చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏ (డియర్‌నెస్ అలవెన్స్) లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశ హాలు నిర్మాణానికి కృషి చేసిన, విరాళాలు అందజేసిన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. కమిటీ సభ్యుల ఆర్థిక సహాయ సహకారాలతో ఈరోజు మీటింగ్ హాల్‌ను ఏర్పాటు చేసుకోవడం సంతోషదాయకమని తెలిపారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా రమేష్ ఈ.ఈ (భూపాలపల్లి), రాజేందర్ ఈ.ఈ (వరంగల్), భీమ్ లాల్ ఈ.ఈ (మహబూబాబాద్), దేవికా చౌహాన్ ఈ.ఈ. తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.పురుషోత్తం, కె.సుధీర్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సమ్మారెడ్డి, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఎల్. ప్రకాష్, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సాంబయ్య, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఖాజా మొయినుద్దీన్, ఇతర జిల్లా, మండల కమిటీ సభ్యులు సుమారు 150 మంది పాల్గొన్నారు.

# ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్:** ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని గిరిజన విద్యుత్ భవన్ లోని కోర్ కమిటీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కోశాధికారిగా గుగులోతు హుస్సేన్ నాయక్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన రాష్ట్ర కోశాధికారి గుగులోతు హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతను అప్పగించిన రాష్ట్ర యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ష్ట్రంలో ఉన్నటువంటి గిరిజన జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తాను. జర్నలిస్టుల సమస్యలను ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తాను. సమస్యల పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతాను. గిరిజన జర్నలిస్టుల తరఫున ఆయన త్వరలో ప్రభుత్వానికి సమస్యలపై విజ్ఞాపన పత్రం అందించే అవకాశం ఉంది.

# నాతి శ్రీనివాస్ గౌడ్‌ను సత్కరించిన బీసీ జేఏసీ నేతలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ప్రవాస భారతీయులు, కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (కానా) సభ్యులు నాతి శ్రీనివాస్ గౌడ్ బుధవారం వరంగల్ నగరంలోని భద్రకాళి అమ్మవారి దేవస్థానంను సందర్శించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వద్దకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ నాతి శ్రీనివాస్ గౌడ్‌ను గౌడజాతి ఆణిముత్యంగా కొనియాడారు. అమెరికాలో స్థిరపడినప్పటికీ, రాష్ట్రంలో నిరుపేద గౌడ కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు, ఆపదలో ఉన్నప్పుడు "నేనున్నానంటూ" ఆదుకుంటున్న గౌడజాతి ముద్దుబిడ్డ నాతి శ్రీనివాస్ గౌడ్ అని వేణుగోపాల్ గౌడ్ ప్రశంసించారు. ప్రవాసంలో ఉండి కూడా సొంత జాతి ప్రజలకు ఆయన అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ సభ్యులు బక్కి అవినాష్, 11వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు గన్నారపు సంగీత్ తదితరులు పాల్గొన్నారు.

# దామెరలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు



**వరంగల్ వాయిస్, దామెర :** మండల కేంద్రంలో బుధవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని శుద్ధి చేసి, పూలమాలలు వేసి నాయకులు, స్థానిక ప్రముఖులు నివాళులు అర్పించారు. ఈ వేడుకల్లో అంబేద్కర్ ఆశయాలు, భారత రాజ్యాంగ విలువలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ గురిజాల శ్రీరాంరెడ్డి, సదిరం పోచయ్య, దామెర రమేష్, వేల్పుల రాజ్ కుమార్, బత్తిని రాజు, వేల్పుల ప్రసాద్, పిట్టల రమేష్, డెంగు నవీన్, ఎక్కలదేవి రమేష్, దామెర ఆనందం, కొడకండ్ల శ్రీను, దామెర సుమన్, మెరుగు సంతోష్, సదిరం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విధానాలతో పెరుగుతున్న అసమానతలు

◆ ఎస్ కేఎన్ రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** కేంద్ర ప్రభుత్వ వినాశనకర విధానాల కారణంగా రైతులు, కార్మికుల పరిస్థితి దుర్భరంగా మారుతోందని, ఇలాంటి పద్ధతులను మానుకోకపోతే భవిష్యత్తులో తీవ్రమైన ప్రతిఘటన తప్పదని సంయుక్త కిసాన్ మోర్చా (SKM) రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్ హెచ్చరించారు. బుధవారం సంయుక్త కిసాన్ మోర్చా పిలుపులో భాగంగా రైతు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వరంగల్‌లో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. ఏకశిలా పార్కు నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించిన అనంతరం, కలెక్టర్ గేటు ముందు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఎస్కేఎం జిల్లా కన్వీనర్ కుసుంబా బాబురావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పెద్దారపు రమేష్ మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమానికి రాతపూర్వక హామీలు ఇచ్చి ఆందోళన నిర్మింపజేసినా, ఆ హామీలను ఆచరణలో అమలు చేయడం లేదని ఆరోపించారు. విదేశీ పత్తి దిగుమతులపై 11% సుంఖాన్ని ఎత్తివేసి, దేశీయ రైతులను దివాలా తీయించే విధంగా విధానాల రూపకల్పన చేసింది. దేశీయ పత్తికి కనీస మద్దతు ధర అమలు కాకుండా పరోక్షంగా ప్రయత్నిస్తూ, సీసీఐ ద్వారా అనేక షరతులు పెట్టి రైతుల పత్తి కొనకుండా ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పుకుంటుంది. పంటల కొనుగోలు సంస్థలైన నాఫేడ్, మార్క్‌ఫెడ్, సివిల్ సప్లై లాంటి వాటిని నిర్వీర్యం చేస్తోంది. పంటల మద్దతు ధర, రుణ విముక్తి చట్టాలు చేయడానికి సిద్ధంగా లేకపోవడం అన్యాయమన్నారు. నూతన విద్యుత్ చట్టం పేరుతో రాష్ట్రాల హక్కులను హరిస్తూ, చౌకగా లభించే విద్యుత్తును ప్రైవేటుపరం చేసే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. కార్మిక సంఘాల రాష్ట్ర, జిల్లా నాయకులు కాసు మాధవి, ముక్కెర రామస్వామి, ఎలకంటి రాజేందర్ మాట్లాడుతూ, కార్మికుల ప్రయోజనాలు కాపాడే 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చే విధంగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం దారుణమన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచడం అన్యాయమని, సమాన పనికి సమాన వేతనం అందించే చట్టాలు చేయకుండా కార్మికుల శ్రమను దోచుకోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. ఎస్కేఎం రాష్ట్ర నాయకులు చిన్న చంద్రన్న, జిల్లా కన్వీనర్లు ఈసంపెల్లి బాబు, రాచర్ల బాలరాజు, సోమిడి శ్రీనివాస్, చుక్క మొగిలి మాట్లాడుతూ రైతు వ్యతిరేక విధానాలు విడనాడి, రైతుల పంటలకు కనీస మద్దతు ధర లభించే విధంగా చట్టం చేసి, మార్కెట్ దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. రైతులకు రావలసిన యాసంగి వరి ధాన్యం బోనస్ మరియు రైతు భరోసా డబ్బులను తక్షణమే రైతులకు చెల్లించాలి.కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు కల్పించి, సరిత గతిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో రైతు కార్మిక సంఘాల నాయకులు గోనె కుమారస్వామి, నర్రా ప్రతాప్, ఆరూరి కుమార్, ఎండి బషీర్ తదితరులతోపాటు అనేకమంది కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేటీఆర్ కు ఘన స్వాగతం



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వరంగల్ పర్యటన సందర్భంగా, కాశీబుగ్గ ప్రాంతంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆదేశాల మేరకు ఈ ర్యాలీ జరిగింది. కాశీబుగ్గ 19వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు చిలువేరు పవన్, 20వ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ఎండీ ఇక్బాల్ ఆధ్వర్యంలో ఈ ర్యాలీని ఏర్పాటు చేశారు. మాజీ కార్పొరేటర్ బయ్య స్వామి జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీలో పుల్ల రమేష్, కలివేలు శేషు, చిమ్మని శివ సంతోష్, కొడాలి రవి, జక్కి యుగంధర్, బిల్లా శివ, వేముల సాయి, కట్కూరి సాయి, అభిలాష్, మంద రమేష్, మహబూబ్, గోరంట్ల వరుణ్, ఆడెపు సమ్ము, చింతకింది మధుకర్, సాయి వర్ధన్, పసుల మహేష్, గుండె సాగర్, జోషి డివిజన్ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కుంకుమేశ్వర ఆలయంలో కార్తీక మహా రుద్రయాగం

**అన్న ప్రసాదం స్వీకరించిన కాంగ్రెస్ నాయకులు**



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల ప్రాంత ఇలవేల్పు అయిన కుంకుమేశ్వర భవాని సమేత కుంకుమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాస మహా రుద్రయాగం అత్యంత వైభవంగా జరిగింది. ఈ యాగానంతరం, పరకాల పట్టణ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు, మున్సిపల్ మాజీ చైర్మన్ సోదా రామకృష్ణ ఆలయాన్ని సందర్శించారు. ఆలయ ప్రధాన అర్చకులు కోమాల్ల నాగభూషణ శర్మ, ప్రధాన అర్చకులు కోమాల్ల సంపత్ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం వారు ఆలయంలోని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో కుంకుమేశ్వర ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులు మార్కరుపతి గౌడ్, పావుశెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన సిరంగి సంతోష్ కుమార్



**వరంగల్ వాయిస్, పరకాల :** సంగెం మండలం పల్లార్‌గూడ గ్రామానికి చెందిన దివంగత బీజేపీ మండల మాజీ అధ్యక్షులు సింగారపు కుమారస్వామి, శ్రీలత దంపతుల ఏకైక పుత్రిక నవ్య మనోజ్ వివాహ మహోత్సవ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ వివాహ వేడుకకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ హాజరయ్యారు. ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నూతన విద్యార్థినులకు ఘన స్వాగతం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయం మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నూతనంగా ప్రవేశాలు పొందిన విద్యార్థినులకు, ఆఖరి సంవత్సరం విద్యార్థినులు బుధవారం అంగరంగ వైభవంగా పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించి స్వాగతం పలికారు. ఈ సమావేశంలో విద్యార్థినులు ఒకరికొకరు పరిచయాలు చేసుకుంటూ, ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ, నేటి విద్యార్థులే రేపటి దేశ దిక్సూచి అని పేర్కొన్నారు. నేటి తరం విద్యార్థులు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని, అదేవిధంగా మహిళా విద్యార్థినులు కూడా ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) టెక్నికల్ రంగాల్లో నూతనంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని దిశా నిర్దేశం చేశారు. మారుతున్న సమాజానికి అనుకూలంగా విద్యను నేర్చుకొని, ఇతరులకు ఆదర్శంగా నిలవాలని కోరారు. తల్లిదండ్రులు కష్టపడి మిమ్మల్ని ఉన్నత స్థాయిలో ఉంచాలని ఉద్దేశంతో ఉన్నారని, వారి కలలను నిజం చేయాల్సిన బాధ్యత మీపై ఉందని ప్రిన్సిపాల్ గుర్తుచేశారు. ఈ పరిచయ కార్యక్రమాన్ని కళాశాలలోని పలు విభాగాల విద్యార్థినులు నిర్వహించారు. ఈ విభాగాలలో సీఎస్ఈ (CSE), సీఎస్ఎం (CSM), సీఎస్‌డీ (CSD), ఈసీఈ (ECE), ఐఎన్ఎఫ్ (INF), త్రిబుల్‌ఈ (EEE) డిపార్ట్‌మెంట్‌ల విద్యార్థినులు పాల్గొన్నారు. అధ్యాపకులు, బోధనేతర ఉద్యోగులు కూడా హాజరై విద్యార్థినులను ప్రోత్సహించారు.

## స్వాద్ బిర్యానీ పాయింట్ ప్రారంభం



**వరంగల్ వాయిస్, హనుమకొండ:** హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ కాలనీ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన స్వాద్ బిర్యాని పాయింటును కాజీపేట రైల్వే డీఎస్పీ రాళ్లపల్లి కృపాకర్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్వాద్ బిర్యాని పాయింట్ ప్రోప్రైటర్ మహమ్మద్ అక్రమ్, వడ్డేపల్లి దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్ల పెల్లి రవీందర్( జెకె), ప్రధాన కార్యదర్శి తాళ్ల పెల్లి ప్రవీణ్, కోశాధికారి నల్ల ఆశీర్వాదం, చీఫ్ అడ్వైజర్ తాళ్లపల్లి ప్రభాకర్, తాళ్లపల్లి ప్రభు చరణ్, తాళ్లపల్లి ప్రసంగి తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచంలోనే అత్యుత్తమ రాజ్యాంగం మనది



**వరంగల్ వాయిస్, వరంగల్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్ సారథ్యంలో రూపొందించబడిన భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమమైనది అని ఏవీవీ జూనియర్ కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ డాక్టర్ చందా విజయ్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఏవీవీ జూనియర్ కళాశాలలో ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 76వ రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ చందా విజయ్ కుమార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అనంతరం విద్యార్థులచే రాజ్యాంగానికి కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. బుజేందర్ రెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఈ.సత్యనారాయణ, చందా భారత మాత, లైఫ్ మెంబర్ చందా శ్రీకాంత్, జి.వీరేష్ లింగం, రాజశేఖర్, డాక్టర్ గోపి, డాక్టర్ వి.శ్రీధర్, రమేష్, రమ్యశ్రీ, జి.శ్రీనివాస్, వై.చండీశ్వర్, అనన్య, స్వప్న, విజ్ఞాన్, లక్ష్మణ్, డిగ్రీ కళాశాల అధ్యాపకులు రవీందర్, కరుణశ్రీ, డాక్టర్ వేణుగోపాల్, శ్రీనివాస్, ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

## కేటీఆర్ కు తెలంగాణ పిండి వంటల బహుకరణ



**వరంగల్ వాయిస్, బాలసముద్రం :** బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ సమీపంలోని బాలసముద్రం ప్రాంతంలో మాజీ మంత్రి కేటీఆర్ ను శ్రీ నిధి తెలంగాణ పిండి వంటలు వారు మర్యాదపూర్వకంగా కలిసి, వారికి ప్రత్యేకంగా తయారుచేసిన తెలంగాణ పిండి వంటలను బహుకరించారు. శ్రీ నిధి తెలంగాణ పిండి వంటల తరఫున అర్చన, భీంరావ్ లు ఈ పిండి వంటలను మాజీ మంత్రికి అందజేశారు.

వరంగల్ వాయిస్ సినిమా
బుధవారం 26 నవంబర్ 2025




# సంక్రాంతి రేసు నుంచి తప్పకున్న నవీన్ పోలిశెట్టి?

యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి, మీనాక్షీ చౌదరి జంటగా మారి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం అనగనగా ఒక రాజు. సితార ఎంటర్ టైన్మెంట్స్ బ్యానర్ పై సూర్య దేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాడు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, ప్రమోషనల్ కంటెంట్ అంతా మంచి ఆదరణను అందుకున్నాయి. ఎన్నో ఏళ్లగా ఈ సినిమా రిలీజ్ కోసం ఎదురుచూస్తూ ఉంది. ఎట్టకేలకు వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో రాజుగారు దిగుతున్నారు అంటూ మేకర్స్ ప్రకటించారు. దీంతో అందరూ ఈ సినిమా కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ మధ్యనే నవీన్ పోలిశెట్టి ప్రమోషన్స్ తో అదరగొట్టాడు. అయితే అది కూడా మూడునాళ్ళ ముచ్చటగా మారిపోయింది. అందుతున్న సమాచారం ప్రకారం ఈ సంక్రాంతి బరిలో కూడా రాజుగారు రావడం లేదని తెలుస్తోంది. చిరంజీవి మన శంకరవరప్రసాద్ గారు, ప్రభాస్ ది రాజా సాబ్, రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి, విజయ్ జన నాయగన్, శర్వానంద్ నారీ నారీ నడుమ మురారి లైన్ లో ఉన్నాయి. ఇక ఇన్ని సినిమాలతో పోటీ తట్టుకోలేక రాజుగారు డ్రాప్ అయ్యారని, సంక్రాంతి రేసు నుంచి నవీన్ తప్పుకున్నాడని వార్తలు వస్తున్నాయి. అందుకే ప్రమోషన్స్ కూడా మధ్యలోనే ఆపేశారని సమాచారం. త్వరలోనే ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా తెలపనున్నారట. మరి ఇందులో నిజమెంత అనేది తెలియాల్సి ఉంది.

# రాజాసాబ్ పాటకు భారీగా వ్యూస్.. లైక్స్

**మూవీపై నిర్మాతల్లో పెరిగిన విశ్వాసం**

ప్రభాస్ హీరోగా పాన్ ఇండియా సినిమా ది రాజా సాబ్ పై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. గత ఏడాది కల్కితో వరల్డ్‌వైడ్ బ్లాక్‌బస్టర్ హిట్ అందుకున్న ప్రభాస్ సినిమాపై అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. సంక్రాంతి రిలీజ్‌గా ఈ సినిమా సిద్ధమవుతుండటంతో హైప్ మరింత పెరిగింది. ఇదిలా ఉండగా, చిత్రబృందం నుంచి వచ్చిన తొలి పాట నవంబర్ 23 విడుదలైంది. కొంత ఆలస్యంగా వచ్చినప్పటికీ, ఆన్‌లైన్‌లో పాటకు మంచి స్పందన లభించింది. టాప్ రికార్డులను బద్దలు కొట్టకపోయినా,ఈ పాటకు వచ్చిన వ్యూస్, లైక్స్ మాత్రం ఆకట్టుకునే స్థాయిలో ఉన్నాయి. విడుదలైన తొలి 24 గంటల్లో ఈ పాటకు దాదాపు 14.92 మిలియన్ వ్యూస్, 335.4ఐ లైక్స్ వచ్చాయి. ఇది పెద్ద రికార్డ్ కాకపోయినా, ఆలస్యంగా వచ్చిన పాటకు ఇవి గుడ్ నెంబర్స్‌గా పరిగణిస్తున్నారు. ప్రభాస్ తాజాగా చేసిన సినిమాలతో పోలిస్తే, ఈ పాటలో ఆయన లుక్, స్క్రీన్ ప్రెజెన్స్ చాలా బాగుందని నెటిజన్లు పేర్కొంటున్నారు. ప్రత్యేకంగా, పాట యూట్యూబ్‌లో విడుదలైన తర్వాత కేవలం 23 నిమిషాల్లో 100ఐ లైక్స్ చేరుకోవడం పాటకు వచ్చిన వేగవంతమైన రెస్పాన్స్‌ను సూచిస్తోంది. ఇది ప్రభాస్ క్రేజ్‌కి నిదర్శనమని అభిమానులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నారు. పాట విడుదల సందర్భంగా హైదరాబాద్‌లోని విమల్ థియేటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక స్క్రీనింగ్‌కు భారీగా అభిమానులు హాజరై మాస్ సెలబ్రేషన్స్ చేశారు. ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. దీంతో 'ది రాజా సాబ్'పై అంచనాలు మరింతగా పెరిగాయి. త్వరలో రానున్న ట్రైలర్, మిగతా పాటలు ఎలా ఉండబోతున్నాయి, సంక్రాంతి సీజన్‌లో ఈ సినిమా ఎంతటి మాస్ స్టార్మ్ సృష్టించబోతుందో అనే ఆసక్తి పెరుగుతోంది.








# 28న అఖండ- 2 ప్రీరిలీజ్ ఈవెంట్


**ముఖ్య అతిధిగా రానున్న సీఎం రేవంత్**

నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ బోయపాటి శ్రీను కాంబోలో అఖండకు సీక్వెల్ గా వస్తున్న చిత్రం 'అఖండ`2. ఇప్పటికే రిలీజ్ చేసిన అఖండ 2 ఫస్ట్ గ్లిమ్స్ సంచలనం సృష్టించింది. ఇటీవల వచ్చిన ఈ సినిమా ఫస్ట్ సింగిల్ జాజికాయ జాజికాయ భారీ వ్యూస్ రాబట్టిన ఈ సెన్సేషన్ సినిమాకు థమన్ సంగీతం అందిస్తున్నాడు. డిసెంబర్ 5న అఖండ 2 వరల్డ్ వైడ్ గా రిలీజ్ కు రెడీ అయింది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్ లో జోరు పెంచింది టీమ్. అందులో భాగంగానే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెల 28న నిర్వహించబోయే అఖండ 2 ప్రీ రిలీజ్ ఈవెంట్ కు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా రాబోతున్నారు. ఇందుకు సంబంధించి అనౌన్స్ మెంట్ కూడా రాబోతుంది. అలాగే ఈ వేడుకకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ని కూడా మరో అతిథిగా పిలిచేందుకు ప్లాన్ చేశారట మేకర్స్. కానీ బన్నీ ప్రస్తుతం అట్లీ సినిమా షూటింగ్ లో బిజీగా ఉండడం వల్ల రావడం కుదరడం లేదట. సినిమా రిలీజ్ అయ్యాక సక్సెస్ మీట్ కి బన్నీ వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. మరోవైపు డిసెంబరు 4న రాత్రి నుంచే ప్రీమియర్లు ప్రదర్శించాలని నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు.

# హరిణ్యారెడ్డితో 27న రాహుల్ పెళ్లి

**సంగీత్ వేడుకల్లో క్రికెటర్ యజ్వేంద్ర చాహల్**

స్టార్ సింగర్ రాహుల్ సిప్లిగంజ్ తనకి కాబోయే భార్య హరిణ్యా రెడ్డికు ఇచ్చిన స్పెషల్ గిఫ్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. నవంబర్ 27న జరగనున్న వారి వివాహం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంగీత్ వేడుకలు అట్టహాసంగా జరుగుతున్న ఈ సమయంలో రాహుల్ ఇచ్చిన సర్‌ప్రైజ్‌కి హరిణ్య తెగ ఫిదా అయింది. టీమ్‌ఇండియా స్టార్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌ని స్వయంగా సంగీత్ వేడుకకు ఆహ్వానించి, తన కాబోయే భార్యకు రాహుల్ స్పెషల్ ట్రీట్ ఇచ్చాడు. చాహల్‌ను చూసి హరిణ్య ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. హరిణ్య తన సోషల్ మీడియాలో .. ఇంత పెద్ద గిఫ్ట్ నా జీవితంలో మర్చిపోలేను. థ్యాంక్ యూ రాహుల్! అంటూ చాహల్‌తో దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో షేర్ చేసింది. ఇవి నెట్టింట వైరల్ అవుతున్నాయి. హరిణ్యా రెడ్డి చాహల్‌కు వీరాభిమాని. ఆమె తన పోస్ట్‌లో మా సంగీత్‌కు వచ్చి మా వేడుకను ప్రత్యేకం చేసినందుకు చాహల్ గారికి ధన్యవాదాలు అని రాసింది. ప్రస్తుతం రాహుల్ సిప్లిగంజ్, హరిణ్య రెడ్డి, క్రికెటర్ చాహల్ కలిసి దిగిన ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుండగా, వీటిని చూసిన అభిమానులు, నెటిజన్లు క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు. ఇటీవల రాహుల్, హరిణ్యా కలిసి తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానించిన విషయం తెలిసిందే. నవంబర్ 27 ఉదయం 5 గంటల సమయంలో వీరి వివాహం జరగనుందని తెలుస్తుంది. కాగా, 'నాటు నాటు' పాట ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న రాహుల్ సిప్లిగంజ్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అభినందించిన విషయం తెలిసిందే.బోనాలు, వినాయక చవితి స్పెషల్ పాటలతో రాహుల్‌కు అపారమైన క్రేజ్ ఉంది.



WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
బుధవారం, నవంబర్ 26, 2025

# సుబ్రహ్మణ్య షష్టికి వేళాయె..

- శ్రీ కుంకుమేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాట్లు
- అర్ధరాత్రి వరకు ప్రత్యేక పూజలు






**వరంగల్ వాయిస్, పరకాల :** భారతావని దక్షిణ పథమున ఓరుగల్లు సమీపంలోని పరకాల పట్టణంలో ప్రముఖ శైవ క్షేత్రంగా శ్రీ కుంకుమేశ్వరుని ఆలయం విరాజిల్లుతోంది. ఈ క్షేత్ర మాహాత్యం, విశిష్టతను ఆలయ ప్రధాన అర్చకుడు సంపత్ కుమార్ శర్మ వివరించారు. ఈ ప్రాంతం పూర్వం పార్వతీ దేవి పరమేశ్వరుడి కొరకు తపస్సు చేసిన కామ్యవనంగా ప్రసిద్ధి చెందింది. పార్వతీ దేవి తపస్సునకు మెచ్చిన పరమేశ్వరుడు ప్రత్యక్షమై సుబ్రహ్మణ్యషష్ఠి రోజున నీ హస్తములతో కుంకుమ రంగరిస్తుండగా ఎరుపు వర్ణంలో లింగరూపమున స్వయం వ్యక్తముగా ఉద్భవిస్తానని, దానిని కుంకుమేశ్వరునిగా అభిషేకించి అర్చించమని అనుగ్రహించి అదృశ్యమైనట్లు తెలిపారు. కొంతకాలం తర్వాత పార్వతీ దేవి స్నానమాచరించేందుకు వామహస్తమున కుంకుమ రంగరిస్తుండగా సుబ్రహ్మణ్యషష్ఠి రోజున ఎరుపువర్ణంలో లింగ రూపమున ఉద్భవించగా పార్వతీదేవి సంతోషంగా శిలా పీఠమును ప్రతిష్ఠించి కుంకుమేశ్వరునిగా అర్చించిందన్నారు. ఇట్టి క్షేత్రం కాలగర్భంలో కలిసిపోగా కలియుగమున కాకతీయ రాజుల పరిపాలనలో పంట పొలముగానుండగా నాగలితో దున్నుతుండగా సుబ్రహ్మణ్యషష్ఠి రోజున నాగలికి అడ్డుతగలగా ఆ ప్రాంతంలో తవ్వి చూడగా శివలింగము దర్శనమిచ్చింది. దీంతో పక్కనే ఉన్న బావిలో నీరు తెచ్చి శుద్ధి చేసి పూజించి పసుపు కుంకుమలు సమర్పించి ఇంటికి చేరుకొని సేదతీరుతుండగా ఉదయం బ్రాహ్మీ ముహూర్తమున పరమేశ్వరుడు స్వప్నమున సాక్షాత్కరించి పై గాథ తెలిపి కుంకుమేశ్వరునిగా అర్చించమని, ఇట్టి క్షేత్రము సుబ్రహ్మణ్య క్షేత్రముగా విరాజిల్లుతుందని సుబ్రహ్మణ్య షష్ఠి బోనము సమర్పించమని, నీవు వెళ్లేసరికి నీవు అర్చించి వచ్చినదంతయూ కుంకుమ వర్ణంగా మారుతుందని తెలిపి అదృశ్యమైనట్లు వెల్లడించారు. మరుసటి రోజు సదరు వ్యక్తి స్నానమాచరించి మరలా అక్కడికి చేరుకోగా తాను సమర్పించిన ద్రవ్యము కుంకుమ వర్ణముగా దర్శమిచ్చింది. విషయాన్ని వెంటనే రాజుగారికి తెలుపగా కాకతీయ రాజైన ప్రతాప రుద్రుడు ఆలయం నిర్మించి, రాజ్యమంతయూ కార్తిక అమావాస్య నుంచి పాలు వితరణ చేయకుండా తాగకుండా సంరక్షించి వారం రోజులు వెన్న చేసి ప్రతి మార్గశిర శుద్ధ పంచమి రోజున ఆనతి కట్టి, సుబ్రహ్మణ్య షష్ఠి రోజున వెన్నతో బోనం సమర్పించారు. ఆనాటి నుంచి నేటి వరకు కుంకుమేశ్వరునిగా శైవాగమోక్తముగా నిత్యోత్సవములు, పక్షోత్సవములు, మాసోత్సవములు, ఆయనోత్సవములు, సంవత్సరోత్సవములు అత్యంత వైభవంగా జరుపుకుంటూ భక్తుల కొంగు బంగారమై కుంకుమయ్యగా పూజలందుకుంటున్నట్లు ప్రధాన అర్చకులు నాగభూషణ శర్మ, సంపత్ కుమార్ శర్మ వివరించారు. బుధవారం సాయంత్రం ప్రారంభం కానున్న షష్ఠి పూజలు రాత్రి పొద్దుపోయే వరకు సాగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాలు డిసెంబర్ 1వ తేదీ వరకు సాగుతాయన్నారు.

### సంతోషంగా ఉంది..

**- ఆలయ చైర్మన్ కొలుగూరి రాజేశ్వరరావు**

ఇంత పెద్ద మహా జాతర, మహా రుద్రాభిషేకం మా చేతుల మీద జరగడం చాలా సంతోషకరంగా ఉంది. పరకాలతోపాటు ఉమ్మడి జిల్లా, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఆనందంగా ఉండాలని ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. నాకు ఇలాంటి అవకాశం కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.







# ఘనంగా శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం

- వేలాదిగా పాల్గొన్న భక్తులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి క్షేత్రంలో బుధవారం అత్యంత వైభవంగా శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణం జరిగింది. రెండు గంటల పాటు నిర్వహించిన కళ్యాణోత్సవ తంతు ఆద్యంతం భక్తులకు ఒక దివ్యానుభూతిని కలిగించింది. పిలిస్తే పలికే దేవుడిగా భక్తులకు అత్యంత విశ్వాసం కలిగిన శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయంలో గత నాలుగు రోజులుగా ఎంతో పవిత్రంగా సుబ్రహ్మణ్యయాగం నిర్వహించారు. ఉదయం నుంచే వేలాదిగా తరలి వచ్చిన భక్తుల సమక్షంలో పూర్ణాహుతిని నిర్వహించారు. అత్యంత వైభవోపేతంగా జరిగిన కళ్యాణోత్సవం అనంతరం వెయ్యి మంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ కళ్యాణోత్సవంలో ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, మోతుకూరి మయూరి రామేశ్వరావు, జారతి వెంకటేశ్వర్లు, అనంతుల శ్రీనివాస్ పాల్గొన్నారు. దేవాలయమును సందర్శించిన భక్తులందరికీ ఆలయ ప్రాంగణంలో తగు సదుపాయాలను ఆలయ కార్యనిర్వహణాధికారి రామల సునీత నేతృత్వంలో కల్పించారు.

# కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం 'టెక్స్‌టైల్ హబ్'

- వరంగల్‌కు పూర్వ వైభవం తీసుకొస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- పార్టీ నేతలతో కలిసి టెక్స్‌టైల్ పార్క్ సందర్శన



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు ప్రస్తుత పరిస్థితి కేసీఆర్ దూరదృష్టికి నిదర్శనం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఒకనాడు ఓరుగల్లు జిల్లా అంటేనే అజంజాహీ మిల్లుకు, ఇక్కడ పండే బ్రహ్మాండమైన పత్తికి ఆలంబనగా నిలిచిందన్నారు. చుట్టుపక్కల జిల్లాల నేతన్నలకు ఉపాధి కల్పించిన ప్రాంతమని గుర్తు చేశారు. ఒక రోజు పర్యటనలో భాగంగా కేటీఆర్ వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ) ను సందర్శించిన అనంతరం పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కేఎంటీపీ ప్రస్తుత పరిస్థితిని వివరించి, ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాల్సిన ఆవశ్యకతను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తు చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ జిల్లా తన పూర్వ వైభవాన్ని కోల్పోయి, నేతన్నలు సూరత్, షోలాపూర్, బివాండి వంటి ప్రాంతాలకు వలసపోయే దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ పరిస్థితిని మార్చి, వరంగల్‌ను ఒక సూరత్ లాగా, తమిళనాడులోని తిరుపూర్ లాగా టెక్స్‌టైల్ హబ్‌గా మార్చాలనే ఉద్దేశంతో 'ఫామ్ టు ఫ్యాషన్' – అంటే నల్లరేగడి నేలల్లో పండే తెల్ల బంగారం (పత్తి) తో రైతుకు, పరిశ్రమలో పనిచేసే మహిళలకు ఉపాధి దొరకాలనే సంకల్పంతో – భారతదేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్కును ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. సరిగ్గా ఎనిమిది ఏళ్ల కిందట, 2017 అక్టోబర్ 22 నాడు కేసీఆర్ ఇదే ప్రాంగణంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేశారన్నారు. మధ్యలో కరోనా కారణంగా రెండేళ్లు ఇబ్బంది కలిగినా, ఈరోజు ఇక్కడికి వచ్చి చూస్తే కైటెక్స్, యంగ్‌వన్, గణేషా లాంటి పరిశ్రమలు దాదాపు 25–30 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి అవకాశాలు కల్పించే స్థాయికి చేరుకోబోవడం సంతోషదాయకం అన్నారు. మేము కిటెక్స్ పరిశ్రమను సందర్శించి, అందులోని అత్యాధునిక స్పిన్నింగ్, గార్మెంటింగ్ పరిశ్రమలను పరిశీలించడం జరిగింది. దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ సంస్థకు కూడా పెద్ద ఎత్తున భూమిని కేటాయించడం జరిగిందన్నారు. ఆ రోజు ధర్మా రెడ్డి శాసనసభ్యుడిగా రైతులను ఒప్పించి, ఉపాధి అవకాశాల గురించి వివరించి, బతిమిలాడి భూసేకరణ చేశారు. ఆ కల సాకారమై పరిశ్రమలు వచ్చి 10 మందికి ఉపాధి కల్పించే స్థాయికి చేరడం చాలా సంతోషం అన్నారు.

మన తెలంగాణను టెక్స్‌టైల్ హబ్‌గా మార్చాలనే విజన్‌తో ఈ పార్కును ఏర్పాటు చేశామన్నారు. ఈ రోజు ఈ రెండు మూడు పరిశ్రమలు తొందరగా ఉత్పత్తి పూర్తి చేసి, పూర్తి స్థాయిలో విస్తరిస్తే 30–40 వేల మందికి ప్రత్యక్షంగా, రెట్టింపు పరోక్షంగా ఉపాధి అవకాశాలు దొరుకుతాయి. ఈ ప్రాంత రూపురేఖలే మారిపోయే అవకాశం ఉంది. అయితే, ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో కనిపిస్తున్నాయన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన ఫ్లైఓవర్ (ఆర్.ఓ.బీ) పనులను పూర్తి చేయాలి. పార్క్ లోపల డ్రైనేజ్, సివరేజ్ సిస్టమ్, కామన్ ఫెసిలిటీస్ పనులు మందకొడిగా నడుస్తున్నాయి. వాటిని కూడా పూర్తి చేయాలని కోరారు. "స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా ఉపాధి అవకాశాల విషయంలో చొరవ తీసుకుని, స్థానికులకే ఉద్యోగాలు దొరికే విధంగా కేసీఆర్ రూపకల్పన చేసిన ఈ కార్యక్రమాన్ని (దాదాపు 1500–1600 ఎకరాలలో డిజైన్ చేసింది) ముందుకు తీసుకెళ్లాలన్నారు. దానికి మా పార్టీ తరపున ప్రధాన ప్రతిపక్షంగా ఎప్పటికప్పుడు మా సహకారం అందిస్తామన్నారు.

### దీక్షా దివస్ పై సన్నాహక సమావేశం..

వరంగల్, హన్మకొండ జిల్లాల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బుధవారం సమావేశమయ్యారు. నవంబర్ 29 నిర్వహించనున్న దీక్షా దివస్ కార్యక్రమంపై బీఆర్ఎస్ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అనే నినాదంతో తెలంగాణ సమాజాన్ని కదిలించిన రోజు నవంబర్ 29 అని గుర్తు చేశారు. శ్రీకాంతా చారి మరణంతో మలి దశ ఉద్యమం పీక్ స్థాయికి చేరిందన్నారు. ఈతరం పిల్లలకు దీక్షా దివస్ గురించి తెలియదన్నారు. బీసీ డిక్లరేషన్ కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించారు.. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు విద్య, ఉద్యోగ, రాజకీయ అవకాశాలు కల్పిస్తాం అని బీసీ ఓట్లను దండుకున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్ విషయంలో ఐదు రకాలుగా మాట్లాడుతోందని విమర్శించారు. 42 శాతం రిజర్వేషన్ల కోసం రూ.160 కోట్లు ఖర్చుపెట్టారు.. బీహార్ లో రాహుల్ గాంధీ డబ్బా కొట్టారు. ఇప్పుడు కేసీఆర్ ప్రభుత్వంలో ఇచ్చిన 24 శాతాన్ని 17 శాతానికి తగ్గించారని దుయ్యబట్టారు. బీసీలను మోసం చేసిన రేవంత్ సర్కార్ ను ఏం చేయాలో నిర్ణయించుకోవాలన్నారు. నర్మెట్ట మండలంలో 17 గ్రామాలు ఉంటే ఒక్కటే సీటు బీసీలకు కేటాయించారన్నారు. కుల గణన చేసి బీసీల సంఖ్య తగ్గించారు .. రిజర్వేషన్లు తగ్గించారు. తడిగుడ్డతో గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలు బుద్ధి చెప్పాలన్నారు. ఏ ఎలక్షన్ వచ్చినా కేసీఆర్ ఇచ్చిన పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుదాం అన్నారు. హైదరాబాద్ లో తన అత్తగారి సొమ్ములా భూములు అమ్ముతున్నారని విమర్శించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com